# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ రోజు పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.
- లోక్‌సభలో సభాపతి ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతోంది.
- దేశంలోని గృహ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి హామీ ఇచ్చారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో పర్యటించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈరోజు న్యూ ఢిల్లీలో సమావేశమై పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. జాతీయ రహదారి నెంబర్ 752 D లోని 80.45 కిలోమీటర్ల పొడవైన బద్నావర్ - పెట్లవాడ్ - తాండ్ల - తిమర్వాణి విభాగాన్ని 4 వరుసల కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు ఆమోదం తెలిపింది. మొత్తం 3 వేల 839.42 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ కారిడార్ ఉజ్జయిని నగరాన్ని ఢిల్లీ - ముంబయి ఎక్స్‌ప్రెస్ రహదారిలోని తిమర్వాణి ఇంటర్‌ఛేంజ్‌తో అనుసంధానిస్తుంది. అదే విధంగా పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని 5 జిల్లాల మీదుగా సాగే రెండు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు మంత్రివర్గ ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టుతో రైల్వే నెట్‌వర్క్ సుమారు 192 కిలోమీటర్ల మేర పెరగనుంది. ఇతర కేబినెట్ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడిస్తూ... జేవార్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే వరకు గ్రీన్‌ఫీల్డ్ కనెక్టివిటీ నిర్మాణానికి సైతం కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. తమిళనాడులోని మధురై విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదాని కల్పిస్తూ.. మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని చెప్పారు. జల్ జీవన్ మిషన్ ను 2028 వరకూ పొడిగిస్తున్నామని అశ్విని వైష్ణవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

జల్ జీవన్ మిషన్ కోసం కేంద్ర మంత్రివర్గం అదనంగా లక్షా 51 వేల కోట్ల రూపాయలను ఆమోదించడాన్ని కేంద్ర జల్ శక్తి శాఖా మంత్రి సి.ఆర్. పాటిల్ ప్రశంసించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 11వ ఇండియా ఇండస్ట్రీ వాటర్ కాన్‌క్లేవ్ లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నీటి లభ్యతను నిర్ధారించడానికి సింధు నది వ్యవస్థ నుండి మిగులు జలాలను పంజాబ్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్‌లకు మళ్లించాలని ప్రభుత్వం యోచిస్తోందని సి.ఆర్. పాటిల్ తెలిపారు. నీటి సంరక్షణకు సంబంధించి నాలుగు విభాగాలలో ఫిక్కీ వాటర్ అవార్డులను ఆయన ఈ సందర్భంగా ప్రదానం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్ సభలో సభాపతి ఓం బిర్లాపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతోంది. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ మధ్యాహ్నం సభలో ప్రవేశపెట్టిన అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఇందుకోసం 10 గంటల సమయం కేటాయించారు. ఈ తీర్మానంపై చర్చ వేళ సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు కోరడంతో అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం సీనియర్ ఎంపీ, ఛైర్పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్ ను నియమించింది. ఆయన నేతృత్వంలో అవిశ్వాస తీర్మానంపై లోక్ సభలో చర్చ కొనసాగుతోంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ చేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చామని విపక్షాలు తెలిపాయి. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, సమాజ్ వాదీ పార్టీకి చెందిన రాజీవ్ రాయ్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహువా మొయిత్రా, తెలుగుదేశం పార్టీకి చెందిన లావు శ్రీకృష్ణ దేవరాయలు ఈ చర్చలో పాల్గొని మాట్లాడారు. చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా పర్యావరణ సమతుల్య అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం గత దశాబ్దకాలంలో దృష్టి కేంద్రీకరించిందని పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. ఈరోజు రాజ్యసభలో ఆ మంత్రిత్వ శాఖ పనితీరుపై జరిగిన చర్చకు ఆయన సమాధానమిస్తూ.. 2014లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైనపుడు దేశంలో రక్షిత ప్రాంతాలు 757 ఉన్నాయని.. 2026 నాటికి వాటి సంఖ్య 1,034కి పెరిగిందని చెప్పారు. ఆ తరువాత గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖపై చర్చ చేపట్టారు. ఇక గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై ప్రశ్నోత్తరాల సమయంలో ఎదురైన ప్రశ్నకు ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 8.73 కోట్ల మంది మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని గృహ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పెట్రోలియం, సహజ వాయువు శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పష్టం చేశారు. భారతదేశ ఇంధన దిగుమతులు వివిధ మార్గాల నుండి కొనసాగుతున్నాయని హర్దీప్ సింగ్ పూరి సామాజిక మాధ్యమం ఎక్స్ లో తెలిపారు. పశ్చిమాసియాలో ఆందోళనకర పరిస్థితి ఉన్నప్పటికీ, దేశీయ వినియోగదారులకు నూరు శాతం CNG, PNG

సరఫరా ఉండేలా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇతర పరిశ్రమలు సైతం తమ సరఫరాలో 70 నుండి 80 శాతం పొందుతూనే ఉన్నాయని వెల్లడించారు. దేశీయ వినియోగదారులకు సరసమైన ఇంధనాన్ని నిరంతరాయంగా సరఫరా చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో పర్యటించనున్నారు. కేరళలో అఖిల కేరళ ధీవర సభ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొంటానని ప్రధానమంత్రి సామజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలియజేశారు. అనంతరం కేరళలో ఇంధనం, రహదారులు, గ్రామీణ మౌలిక సదుపాయాలు, రైల్వే వంటి రంగాలకు చెందిన అనేక అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నానని తెలిపారు. ఆ తరువాత ఎర్నాకుళంలో జరిగే ఎన్డీయే బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. కేరళ పర్యటన ముగించుకొని తమిళనాడు తిరుచిరాపల్లిలో పెట్రోలియం, సహజ వాయువు, రోడ్లు, రైల్వేలకు సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం తిరుచిరాపల్లిలో జరిగే ఎన్డీయే ర్యాలీలో పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఓటరు జాబితా నుంచి అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరును తొలగించబోమని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి గ్యానేశ్ కుమార్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం కేంద్ర ఎన్నికల బృందం పశ్చిమబెంగాల్లో ఈరోజు పర్యటించింది. రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం గ్యానేష్ కుమార్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. పశ్చిమబెంగాల్లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే ఎన్నికల సంఘం మొదటి ప్రాధాన్యతని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాల్లో `ప్రత్యేక సమగ్ర సవరణ` (ఎస్ఐఆర్) అమలవుతుందన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా ఉండటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ బాధ్యత అని ఉద్ఘాటిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియలో పాల్గొంటున్న జ్యుడీషియల్ అధికారులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ప్రక్రియలో జుడీషియల్ అధికారులు తీసుకునే నిర్ణయాలపై వచ్చే అప్పీళ్లను పరిష్కరించడానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేయవచ్చని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. అదే విధంగా ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో జుడీషియల్ అధికారుల నిర్ణయాలకు వ్యతిరేకంగా వచ్చే అప్పీళ్లను విచారించేందుకు ఒక అప్పీలేట్ బాడీని ఏర్పాటు చేస్తూ.. నోటిఫికేషన్ జారీ చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గత దశాబ్దకాలంలో **44** శాతం మేర పెరిగిందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =